మూగజీవికీ టీకా

- ముందస్తుగా వేయిస్తే సీజనల్ వ్యాధులకు చెక్
- వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలి
- పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామస్వామి



టీకాలకు ఆసుపత్రికి వచ్చిన మేకలు, గొర్రెలు

పెద్దాపురం: సీజనల్ వ్యాధులకు మూగజీవాలు అతీతం కాదు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పచ్చగడ్డి పెరగడంతో పాటు పచ్చిక తినే పశువుల కడుపులో మట్టి చేరి నత్తలు తయారవుతున్నాయని పశు పోషకులు వాపోతున్నారు. ఈ కాలంలో ప్రమాదకరమైన చిటికె వ్యాధి సోకితే పశువులు మృత్యువాత పడతాయి. జబ్బవాపు, గొంతువాపు, జలకుట్టు (జలగ రోగం), పారుడు తదితర వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ.

మండలంలో 25,510 గేదెలు, 5,123 ఆవులు, 10,200 గొర్రెలు, 5,255 మేకలు, సుమారు ఐదున్నర లక్షల కోళ్లు ఉన్నాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల నట్టల నివారణ శిబిరాలు నిర్వహించారు. అలాగే ఇతర వ్యాధులను పరిశీలిస్తే..

గొంతువాపు: బ్యాక్టీరియా వల్ల గోజాతి పశువుల్లోనూ, గేదెలు, మేకలు, గొర్రెలకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. పశువు నోటి నుంచి నురగ వస్తుంది. తీవ్రమైన గురక వస్తాయి. 104 నుంచి 106 డిగ్రీల వరకు శరీర ఉష్ణోగ్రత ఉంటుంది. కళ్లు ఎరుపెక్కుతాయి.

జబ్బవాపు: జబ్బవాపు వ్యాధి ఆవులు, గేదెలకు కలుషిత నీరు తాగడం వల్ల వస్తుంది. పశువులకు వెనుక భాగంలో రెండు వైపులా జబ్బ వాస్తుంది. ఇది ద్రవంతో కూడిన వాపు. ఆ భాగంలో తాకితే శరీర భాగం వేడిగా ఉంటుంది. చేతితో తాకినపుడు ఒక విధమైన శబ్దం వస్తుంది.

జలగరోగం: కలుషిత ఆహారం, మురుగునీరు తీసుకోవడం వల్ల జలగ రోగం (జీర్ణకోశ వ్యాధులు) సోకుతుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పేడ పలుచగా వేస్తుంది. ఆకలి మందగిస్తుంది. ఈ వ్యాధి నివారణకు రఫాక్సనైడ్, ఆల్బెండజనల్, ఐవర్ మెట్టిన్ వంటి మందులను నోటి ద్వారా పట్టించాలి.

పారుడు వ్యాధి: గొర్రెలు, మేకలకు జ్వరం వస్తుంది. కళ్ల వెంబడి నీళ్లు కారతాయి. శరీర ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. తరచు పారుతుంది.



ఆర్‌బీ పట్నంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మూడేళ్లకు ఒక సారి పీపీఆర్ టీకాలు వేయిస్తే ఈ సమస్య రాదు.

తెగుళ్లు సోకే సీజన్ ఇదే



రైతులు అప్రమత్తంగా ఉండాలి. పశువులకు తెగుళ్లు సోకే సీజన్ వర్షాకాలమే. ఈ కాలంలో రైతులు తమ పశు సంపదపై అప్రమత్తంగా ఉండాలి. తెగుళ్లు – లక్షణాలను గమనించిన వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించాలి. పశువుల్లో సోకే రోగాలకు టాకా ప్రభావవంతమైన మందు. చిన్న టీకా కదా అని అశ్రద్ధ చేస్తే రోగం ముదురుతుంది. ముందు జాగ్రత్త చర్యగా గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ నిర్వహించే పశు వైద్య శిబిరాల్లో రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి.

– టి.రామస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, పెద్దాపురం

క్లుప్తంగా

ఫిష్ ఆంధ్రా మొబైల్‌ను వినియోగించుకోవాలి



ఫిష్ ఆంధ్రా మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: వ్యాపారులు అన్నివేళలా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఫిష్ ఆంధ్రా మొబైల్ అందుబాటులోకి తెస్తున్నట్టు ఎమ్మెల్యే దొరబాబు అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా వ్యాపారులకు అందిస్తున్న వాహనాలను పిఠాపురంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.4.50 లక్షలు విలువ చేసే వాహనాలను ప్రభుత్వం ఓసీ, బీసీలకు 40శాతం, ఎస్సీలకు 60శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పిఠాపురం విద్యార్థి



నందకిషోర్

పిఠాపురం: పాండిచ్చేరిలో రేపటి నుంచి 9వ తేదీ వరకూ జరగనున్న జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్ ట్రోఫీలో పిఠాపురానికి చెందిన ఎన్.నందకిశోర్ ఆడనున్నాడు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాడు. జిల్లా, రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని జిల్లా జట్టుకు బంగారు పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించడంతో రాష్ట్ర జట్టు శిక్షణ తరగతులకు ఎంపికయ్యాడు. చిత్తూరులో జూలై 25 నుంచి 31వ తేదీ వరకూ శిక్షణలో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

భీమా వరితో అధిక దిగుబడి



వీకే రాయపురంలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

సామర్లకోట: వీకే రాయపురంలో పొలాలు ముంపునకు గురవుతున్న రైతులు భీమ అనే వరి రకాన్ని వేసుకోవాలని, దాంతో ముంపును తట్టుకుని దిగుబడి ఇస్తుందని మార్టేరు శాస్త్రవేత్త కృష్ణాజీ తెలిపారు. మంగళవారం సాయంత్రం వీకే రాయపురంలో నీట మునిగిన పంటల విషయమై రైతులకు ఆయన పలు సూచనలిచ్చారు. కలుపు యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాకినాడ ఏడీఏ జీవీ పద్మశ్రీ అన్నారు. ఎంపీఓ ఐ.సత్య, ఏఈఓ ఎంవీ సతీష్, వీపీఏ శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వేగంగా భవన నిర్మాణ పనులు



వాకతిప్పలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న నారాయణమూర్తి

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాల నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీఓ నారాయణమూర్తి అన్నారు. మండలంలోని నిర్మాణంలో ఉన్న భవనాలను మంగళవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గోర్స గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్లు, యండపల్లి గ్రామ సచివాలయం–2, వాకతిప్ప రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు.

పోషకాహారంతో చక్కని ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: పోషకాహారం ద్వారా మహిళలు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష అన్నారు. స్థానిక అంకయ్యపేటలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఏసీడీపీఓ జ్యోతి, వార్డు కౌన్సిలర్ ఒబిలిశెట్టి నూకరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేకు సహకరించండి

- ఆర్డీఓ జేవీఎస్ రామారావు
- రాజకీయ పార్టీలకు అవగాహన



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల రీ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు సర్వేపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రీ సర్వే విధానంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎన్నికల డీటీ కాంతారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), నీలపాల సూరిబాబు (సీపీఎం), అడబాల కుమారస్వామి (టీడీపీ) చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

పెద్దాపురం: బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలు రద్దు చేయాలంటూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. చింతల సత్యనారాయణ మాట్లాడుతూ 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేసి లబ్ధి చేకూర్చారని, వాటిని రద్దు చేస్తూ విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేసి పథకాలు పునరుద్ధరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ జితేంద్రకు వినతిపత్రం అందజేశారు. తేనెల శ్రీను, రాజమహేంద్రపు రామారావు, మాగాపు నాగు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న హింస

పిఠాపురం: దేశంలోనూ, రాష్ట్రాలలోనూ చిన్నారులు, మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. హింసలపై మహిళా పోరుయాత్ర, జీపుజాతాకు మహిళా సంఘాలు పిఠాపురం బైపాస్ రోడ్డులో మంగళవారం స్వాగతం పలికాయి. ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కాలేజీ వద్ద సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి ఒక మద్యం షాపునకు అనుమతి ఇవ్వాలి, మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. సత్యవతి, సీహెచ్ రమణి, వరలక్ష్మి, కుంచే మణి, కేవీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన



పాలవెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతీ పాడి రైతుకు లాభం చేకూరాలనే ఉద్దేశంతో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొండెవరంలోని జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. కేంద్రాలకు అందించిన సామగ్రి, పరికరాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతీ గ్రామంలో పాల సేకరణకు మహిళా సమాఖ్య సభ్యుల ద్వారా శ్రీకారం చుట్టామన్నారు. మండలంలో 13గ్రామాలకు గానూ 10 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజూ కేంద్రాల ద్వారా 160 లీటర్ల పాలను కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా పాలవెల్లువకు సంబంధించి ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి బృంద కార్యదర్శులు రైతుల వద్దకు వెళ్లి, వారి పాడి వివరాలను తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దారు ప్రసాద్ ఉన్నారు.

మహిళా చైతన్యానికే పోరు యాత్ర



సామర్లకోటలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

సామర్లకోట: మహిళలపై జరుగుతున్న హింసలపై చైతన్యం చేయడానికి పోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అన్నారు. విశాఖపట్నంలో ప్రారంభమైన యాత్ర మంగళవారం సాయంత్రం సామర్లకోట చేరింది. ఈ సందర్భంగా అమ్మణమ్మ అపార్టుమెంటులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. హింస లేని సమాజం కోసం మహిళలు చేయి చేయి కలుపాలని పిలుపు నిచ్చారు. మణిపూర్‌లో రోజు రోజుకు మహిళలపై జరుగుతున్న హింసలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులు వై.సత్యవతి, పి.పూర్ణ, సీహెచ్ రమణి, జిల్లా కార్యదర్శి కె వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈటీసీలో కొనసాగుతున్న శిక్షణ



మునగ మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఎం, ఏపీఓలు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం కొనసాగింది. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని అధికారులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో మునగచెట్ల పెంపకానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. రెండో రోజు శిక్షణలో ఫ్యాకల్టీలు గౌరీశంకర్, నరేష్‌బాబు, ఎంఎస్ఎస్ రెడ్డి, కేఎస్ఆర్‌కే నిహారిక, పి. శ్రీనివాస రావు, ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. అనంతరం సాయంత్రం మునగ తోటలపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థినులకు కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సమీరా ఆలూరి

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో సెర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళా విద్యార్థులను ఉద్దేశించి సెంటర్ ఫర్ ఎంపవరింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ వుమెన్ (సిడో) అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సమీరా ఆలూరి మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జీవన విధానాన్ని వివరించారు. ఏఐడబ్ల్యూసీ ట్రెజరర్ పద్మజారాణి, ఏఎస్‌డీ వుమెన్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి, సంధ్య, అలివేణి, విద్యార్థినులు అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

ఇది చేతల ప్రభుత్వం

- ఎమ్మెల్యే దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. దీనికి నిదర్శనమే నవరత్నాల పేరుతో సాగుతున్న అభివృద్ధి అని చెప్పారు. పిఠాపురం పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలోని నాల్గవ వార్డులో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ గడపకూ వెళ్లి నాలుగు సంవత్సరాలుగా పొందిన లబ్ధిని లబ్దిదారులకు బుక్‌లెట్ అందజేసి వివరించారు. వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తపల్లి బుజ్జి దంపతులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందే విధంగా వలంటీర్లను నియమించారన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయని చెప్పారు.

రూ.38 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే దొరబాబు సుమారు రూ.38 లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 5లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.15 లక్షలతో రోడ్లు, మరో రూ.18 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. వైస్ చైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా రామయ్య , మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఏటిపట్టులో సినిమా చిత్రీకరణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నూతన దర్శకుడు రాజేష్ జగన్నాథం

పెద్దాపురం: స్థానిక ఏటిపట్టు గ్రామాల్లో 12 రోజుల పాటు సినిమా చిత్రీకరణ చేయనున్నట్టు నూతన దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం తెలిపారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో చిత్ర యూనిట్‌తో కలసి మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ థ్రిల్లర్‌గా రూపొందించనున్న ఈ చిత్రాన్ని కాండ్రకోట, సిరివాడ, తిరుపతి తదితర గ్రామాల్లో చిత్రీకరించనున్నామన్నారు. వరుణ్‌సందేశ్ కథానాయకుడుగా, రెండో కథ నాయకుడిగా సిద్ధార్థ్ నటిస్తున్నారన్నారు. కథా నాయికలుగా శ్రేయారాణి, అణి, మధు నటిస్తున్నారు.

అక్రమ మైనింగ్ ఆపాలి

పెద్దాపురం: రామేశంపేట అక్రమ మైనింగ్‌ను వెంటనే ఆపాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు ధర్నా చేశారు. అనంతరం అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ జేవీఎస్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. వి.రాజుబాబు, బి.రమేష్, కుంచే అంజిబాబు, కడితి సతీష్, రైతుకూలీలు పాల్గొన్నారు.

వేకువజామునే పింఛన్ల పంపిణీ



సామర్లకోటలో సూర్యకాంతంకు పింఛను అందజేసిన వలంటీర్ శ్యామల

సామర్లకోట: ప్రతినెల ఒకటో తేదీన అందజేస్తున్న సామాజిక పింఛన్లను వలంటీర్లు వేకువజామునే అందజేశారు. మంగళవారం తెల్లవారు జామునే ఇళ్లకు వెళ్లి లబ్దిదారులకు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కలసి పట్టణ, మండల పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిలకు 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారని అధికారులు తెలిపారు.

అన్నవరంలో అంతర్గత బదిలీలు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తొలిసారిగా ఏఈఓ స్థాయి నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల వరకు 98 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీలు నిర్వహించారు. మూడు నెలలకొకసారి దేవస్థానం సిబ్బందిని అంతర్గత బదిలీలు నిర్వహించాలన్న దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు నిర్వహించినట్టు ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం తెలిపారు. పీఆర్వో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు స్థానంలో ఏఈఓ పాలంకి జగ్గారావును నియమించారు. బుధవారం సాయంత్రానికి సిబ్బంది బదిలీ అయిన స్థానాలలో జాయిన్ అవ్వాలని ఈఓ ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పిఠాపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.చిన్న, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవార ం భవన నిర్మాణ కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. పెండెంగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కరణం విశ్వనాథం, జి.వీరబాబు, కొయ్యల రమణ పాల్గొన్నారు.

వన దుర్గమ్మవారికి ప్రత్యంగిర హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి అధిక శ్రావణ పూర్ణిమ సందర్భంగా మంగళవారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, వన దుర్గ ఆలయ అర్చకులు చిట్టెం వాసు, నగేష్, ముఖ్య అర్చక గంగాధరబట్ల శ్రీనివాస్, వ్రత పురోహితులు హోమం నిర్వహించారు.

మహిళా శక్తి ప్రారంభం

సామర్లకోట: స్థానిక 27, 28 వార్డుల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మహిళాశక్తి కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. చంద్రబాబునాయుడు రూపొందించిన మెనిఫెస్టోను రాజప్ప ఈ సందర్భంగా వివరించారు. కౌన్సిలర్లు బలుసు వాసు, విజయలక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



పోలింగ్ బూత్ స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజవర్గ బూత్ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. గత నెల 21న ప్రారంభమైన ఓటర్ల జాబితా ముసాదాకు సంబంధించి రూరల్ నియోజవర్గంలో రెండు లక్షల 54 వేల మంది ఓటర్లకు ఇప్పటి వరకూ 24,348 ఇళ్లను సందర్శించి 47,786 మంది ఓటర్లను గుర్తించామన్నారు. బూత్ స్థాయి అధికారులు రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిబద్ధంగా, పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. రూరల్ తాహసీల్దార్ మురార్జీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు నిషేధించాలి



జెడ్పీసెంటర్‌లో యాత్రకు స్వాగతం పలుకుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

బోట్‌క్లబ్: మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలకు కారణమైన మద్యం, మత్తు పదార్థాలు నిషేధించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి ఈ నెల 28న బస్సు ద్వారా బయలుదేరిన పోరు యాత్ర మంగళవారం కాకినాడ చేరుకుంది. స్థానిక జెడ్పీ సెంటర్ వద్ద స్థానిక ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలు స్వాగతం పలికారు. మహిళల రక్షణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, పోర్న్ వెబ్‌సైట్‌లు నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.నాగజ్యోతి, భూలక్ష్మి, భవాని, పద్మ తదితరులు పాల్గొన్నారు.